సాక్షి మహబూబ్‌నగర్

శుక్రవారం । 31 । మార్చి । 2023



లంచగొండుల రాజ్యం

రాష్ట్రంలో లంచగొండుల రాజ్యం నడుస్తోందని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.

వివరాలు 8లో ▸



ఆర్థిక రక్షణ

ఏకల్ విద్యాలయ అనే స్వచ్ఛంద సంస్థ మహిళల ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తోంది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.5 /23.4

రోజంతా ఎండ తీవ్రత సాధారణంగా ఉంటుంది. అప్పుడప్పుడూ ఆకాశం తేలికపాటి మేఘావృతమై ఉంటుంది.



మహబూబ్‌నగర్‌లో కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



సిర్సనగండ్లలో మాంగళ్యం చూపిస్తున్న వేదపండితుడు



మహబూబ్‌నగర్‌లో రాములవారి మూలవిరాట్

భక్తితో నమస్కరిస్తున్న యువతి

ఆకాశమంత పందిరి.. భూదేవంత సందడి

ఆకాశమంత పందిరి.. భూదేవంత సందడితో పల్లె, పట్టణమంతా పరవశించిపోయాయి. గురువారం శ్రీరామ నవమిని వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ క్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా జరిపించారు. పాలమూరులో జరిగిన ఆయా వేడుకల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఉమ్మడి జిల్లాలో రెండో అపర భద్రాద్రిగా పేరుగాంచిన సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయంలో వేడుకలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హాజరై ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయా వేడుకల్లో భక్తులు వేలాదిగా పాల్గొని కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించి పునీతులయ్యారు. - సాక్షి నెట్‌వర్క్

- మరిన్ని వివరాలు 8, 9లో..



న్యూస్‌రీల్

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు: ఎస్పీ

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో వచ్చే నెల 3 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద భద్రతపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కె.నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30వరకు నిర్వహిస్తున్న క్రమంలో విద్యార్థులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. జిల్లాలోని 59 పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమల్లో ఉంటుందని, ఇద్దరూ అంతకంటే ఎక్కువ మంది ఉండరాదని, కేంద్రాల దగ్గర జిరాక్స్ కేంద్రాలు మూసి ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులు మాత్రమే కేంద్రం లోపలికి రావాలని, విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు, ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్‌లు సైతం పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు తీసుకురావొద్దని సూచించారు. పరీక్ష కేంద్రంలో ఏదైనా అవాంచనీయ ఘటనలు జరిగితే స్థానికంగా ఉన్న పోలీసులతో పాటు డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

కందూరులో ఆభరణాల ఊరేగింపు



అడ్డాకుల: మండలంలోని కందూరులో గురువారం రాత్రి స్వామివారి ఆభరణాలను ఊరేగించారు. గ్రామానికి సమీపంలో వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గ్రామంలోని తంబళి వంశీయుల ఇంట్లో ఉన్న స్వామివారి వెండి ముఖం, నాగపడగలను ఈ నెల 7న రాత్రి ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు, జాతర ముగియడం, శ్రీరామ నవమి సైతం పూర్తి కావడంతో రాత్రి వాటిని రామలింగేశ్వరాలయం నుంచి ఊరేగింపుగా గ్రామంలోకి తెచ్చి తంబళి వంశీయుల ఇంట్లో భద్రపర్చారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకాంత్, ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం శుక్రవారం నుంచి పూర్తిస్థాయిలో ప్రారంభంకానున్నాయి. ఇందులో దాదాపు 500 మందికిపైగా సిబ్బందికి విధులు నిర్వహించేందుకు బోర్డు నుంచి ఆర్డర్లు వచ్చాయని, వారందరూ విధులకు హాజరుకావాలని డీఐఈఓ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం అందరూ జిల్లాకేంద్రంలోని బాలుర కళాశాల క్యాంపులో రిపోర్టు చేయాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే ఇంటర్ బోర్డు కమిషనర్ చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే సంస్కృతం సబ్జెక్టు పేపర్ వ్యాల్యువేషన్ కొనసాగుతుండగా శుక్రవారం నుంచి ఇంగ్లిష్, తెలుగు, మ్యాథ్స్, సివిక్స్ సబ్జెక్టుల వ్యాల్యువేషన్ ప్రారంభం కానుంది. ఇందుకోసం 1.6 లక్షల జవాబుపత్రాలు వచ్చాయని, వీటికి కోడింగ్ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఆపద వేళ.. స్పందించేలా



ఎస్పీ ఆఫీస్‌లో సీపీఆర్ చేస్తున్న కానిస్టేబుళ్లు (ఫైల్)

ఇటీవల గణనీయంగా పెరిగిన గుండెపోటు మరణాలు

- మృతుల సంఖ్య తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు
- నేటి నుంచి ఆరోగ్యశాఖ సిబ్బందికి మూడురోజుల పాటు సీపీఆర్‌పై శిక్షణ
- ప్రత్యేక శిక్షకులకు బాధ్యతల అప్పగింత
- 20 మందిని ఒక బ్యాచ్‌గా ఏర్పాటు చేసి అవగాహన

పాలమూరు: ఇటీవలి కాలంలో చాలా వరకు గుండెపోటు మరణాలు విపరీతంగా పెరిగిపోయాయి. ఎవరు ఎప్పుడు ఎక్కడ గుండెపోటుతో చనిపోతున్నారో చెప్పలేని పరిస్థితి దాపురించాయి. చిన్నా, పెద్ద, స్త్రీ, పురుషులు తేడా లేకుండా క్షణకాలంలో విలవిలలాడుతూ మృత్యుఒడికి చేరుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో కొందరు మెడికల్ ఆఫీసర్లకు కార్డియో పల్మనరీ పునరుజ్జీవనం (సీపీఆర్)పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా జిల్లాలోని ప్రభుత్వ శాఖలలో పనిచేసే ఉద్యోగులకు శుక్రవారం నుంచి సీపీఆర్‌పై అవగాహనతో పాటు శిక్షణ ఇచ్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మార్చి 31, ఏప్రిల్ 1, 2 తేదీల్లో జిల్లాలోని వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందికి శిక్షణ తీసుకున్న నలుగురు మెడికల్ ఆఫీసర్లు సీపీఆర్‌పై అవగాహన కల్పించనున్నారు. సీపీఆర్ చేయడం వల్ల దాదాపు 50 శాతం మనిషి ప్రాణాలు రక్షించవచ్చు. కానీ, అది ఎలా చేయాలో మాత్రం అవగాహన ఉండదు. అంబులెన్స్ వచ్చి అతన్ని ఆస్పత్రికి తరలించేలోగా సమయం దాటిపోతుంది. కొన్నిసార్లు రోగి మృతి చెందే అవకాశం ఉంది. ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతిఒక్కరికి సీపీఆర్‌పై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

మొదట ఆరోగ్యశాఖ

సీపీఆర్ విధానంపై మొదట ఆరోగ్య శాఖలో ఉండే సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. మూడు రోజుల్లో ఆరోగ్య శాఖలో ఉన్న అందరికీ సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో ఆశలు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, పీహెచ్‌సీ సిబ్బంది, సబ్ సెంటర్ వైద్యులకు ఇలా పీహెచ్‌సీ వారి ఒక్కో బ్యాచ్‌లో 20 మందిని ఎంపిక చేసి వారికి దాదాపు 30 నిమిషాల పాటు సీపీఆర్ శిక్షణ ఇస్తారు. జిల్లాలోని బాలానగర్, రాజాపూర్, మిడ్జిల్, గంగాపూర్, జడ్చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు శివకాంత్, మనుప్రియ శిక్షణ ఇవ్వనున్నారు. ఇక అడ్డాకుల, జానంపేట, భూత్పూర్, జిల్లాకేంద్రంలోని మోతీనగర్, కుమ్మరివాడి, పాత పాలమూరు, రామయ్యబౌళి అర్బన్ హెల్త్ సెంటర్లలో డాక్టర్ షబానా శిక్షణ ఇస్తారు. అలాగే గండేడ్, మహమ్మదాబాద్, కోయిలకొండ, కోత్లాబాద్, హన్వాడలో డాక్టర్ నరేష్, దేవరకద్ర, చిన్నచింతకుంట, పేరూర్, ఎదిర, నవాబుపేట పీహెచ్‌సీలలో ఉండే సిబ్బందికి డాక్టర్ శరత్‌చంద్ర శిక్షణ ఇవ్వనున్నారు.

ఎంతో కీలకం

కార్డియో పల్మనరీ రీససిటేషన్‌నే సీపీఆర్‌గా వ్యవహరిస్తారు. గుండెపోటు (హార్ట్‌ఎటాక్), ఆకస్మిక గుండె వైఫల్యం (కార్డియాక్ అరెస్ట్)తో గుండె ఆగిపోయేప్పుడు తిరిగి రక్తం పంప్ చేసేందుకు ఈ ప్రక్రియ దోహదం చేస్తోంది.

→ గుండె పైభాగంలో ఉండే స్టెర్నమ్ అనే ఎముక వద్ద చేయిపై చేయి పెట్టి గట్టిగా ఒత్తిడి కలిగించాలి. నిమిషానికి వందసార్లు ఇలా చేయడంతో గుండె కణజాలం రక్తనాళాల్లో ఒత్తిడి పెరిగి తిరిగి గుండె కొట్టుకోవడం ప్రారంభిస్తుంది.

→ సాధారణంగా గుండె నిమిషానికి 60 నుంచి 80 సార్లు కొట్టుకుంటుంది. గుండెపోటు లేదంటే వైఫల్యంతో పూర్తిగా ఆగిపోతుంది. కొందరిలో గుండె వేగంగా కొట్టుకొని తర్వాత ఒక్కసారిగా ఆగిపోతుంది. ఇలాంటి సమయంలో సీపీఆర్ చేయడం వల్ల ప్రయోజనం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

→ గుండెపోటు, గుండె వైఫల్యం చెందిన 5-7 నిమిషాల్లోనే ఈ ప్రక్రియ చేయాలి. ఎంత ఆలస్యమైతే రోగి కోలుకునేందుకు అవకాశాలు నిమిషానికి 7- 10 శాతం చొప్పున తగ్గిపోతుంటాయి.

ఐదుమందిని రక్షించవచ్చు

ప్రతిఒక్కరూ నాణ్యతతో కూడిన సీపీఆర్ విధానం నేర్చుకోవడం వల్ల గుండెపోటు వచ్చిన ప్రతి పది మందిలో ఐదుగురిని సీపీఆర్ చేసి రక్షించవచ్చు. సీపీఆర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలి. మూడు రోజుల్లో ఆరోగ్యశాఖలో ఉన్న అందరికీ శిక్షణ ఇస్తాం.

– డాక్టర్ శివకాంత్, సీపీఆర్ శిక్షకుడు

ప్రణాళికబద్ధంగా..



జిల్లాలో ఐదు రూట్స్ ఏర్పాటు చేసి ప్రతి శిక్షకుడు ఐదు పీహెచ్‌సీల్లో ఉన్న సిబ్బందికి రోజుకు రెండు పీహెచ్‌సీలలో ఉదయం, సాయంత్రం శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం. ఇందులో ప్రధానంగా సీపీఆర్ ఎందుకు.. ఎలా.. ఎప్పుడు చేయాలి.. అనే అంశాలపై అవగాహన కల్పిస్తాం. సీపీఆర్‌పై అందరూ అవగాహన పెంచుకుంటే చాలా వరకు గుండెపోటు మరణాలు తగ్గించవచ్చు.

– డాక్టర్ నరేష్, శిక్షకుడు


శిక్షణ పొందాం..



గతంలో రాష్ట్రస్థాయిలో సీపీఆర్‌పై శిక్షణ తీసుకున్నాం. ప్రస్తుతం పీహెచ్‌సీలలో సిబ్బందికి సీపీఆర్ ప్రాముఖ్యత తెలియజెప్పి, వారితో ప్రాక్టికల్ చేయిస్తాం. దాని వల్ల సిబ్బందికి సీపీఆర్‌పై అర్థమయ్యే విధంగా చెబుతాం.

– డాక్టర్ మనుప్రియ, శిక్షకురాలు

వేంకటేశ్వరస్వామి ఆలయంలో మినీ కల్యాణ మండపం



దేవాలయంలో బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రతి పండుగకు అంగరంగ వైభవంగా పూజలు జరిగే కాటన్‌మిల్ వెంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆలయంలో ఇటీవల వేయించిన బోర్‌వెల్‌ను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒకప్పుడు దేదీప్యమానంగా విరాజిల్లిన ఆలయం నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రూ.50లక్షలతో మినీ కల్యాణ మండపం నిర్మిస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులను నెలరోజుల్లో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఆలయం ప్రధాన రోడ్డు వెంట షాపింగ్ కాంప్లెక్స్ సైతం నిర్మించి దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. దేవాలయానికి చెందిన నిధులను బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆలయ నిర్వహణ చేపట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ శంకర్‌సింగ్, మాజీ మార్కెట్ చైర్మన్ రాజేశ్, కౌన్సిలర్ కిషోర్, జగన్‌మోహనాచారి, రామలింగయ్య, శ్రీకాంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

- పట్టణంలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు నిర్మాణమే..
- ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్న అధికారులు



ఎనుగొండ బీసీకాలనీలోని పార్కు స్థలంలో అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది (ఫైల్)

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని వివిధ వార్డుల్లో ఆక్రమణలు వెలుగు చూస్తున్నాయి. గతంలో పార్కుల కోసం వదిలిన స్థలాన్నీ కొందరు వ్యక్తులు ఆక్రమించుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని వార్డు నం.3లోని బీసీకాలనీలో 1998లో ఓ వెంచర్ వెలిసింది. దీంతో ఇక్కడ 400 నుంచి 500 వరకు ఇళ్లు నిర్మించుకున్నారు. నిబంధనల ప్రకారం నిర్వాహకులు 10శాతం స్థలం మున్సిపాలిటీకి వదిలారు. అందులో కొంత భాగం శ్రీమాతా మల్లమ్మదేవి ఆలయానికి ఇచ్చారు. ఇది పోను మిగిలిన స్థలంలో పార్కు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించినా ఎలాంటి చర్యలు చేపట్టలేకపోవడం అక్రమార్కులకు కలిసివచ్చింది. ఇదే అదనుగా భావించి ఓ వ్యక్తి ఏకంగా ఇటీవల తన భార్య పేరిట అందులో ప్లాటు ఉందంటూ ఏకంగా ప్రహరీ నిర్మించారు. చుట్టు పక్కలవారు గమనించి కలెక్టర్ రవినాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు అక్కడికి వెళ్లి తొలగించారు. ఇక విఘ్నేశ్వరకాలనీ (వార్డు నం.10) లోని ఓ గల్లీలో సెట్‌బాక్ వదలకుండా ఓ ఇంటి యజమాని రెయిలింగ్ నిర్మించారు. అసలే ఆ ప్రాంతం మొత్తం 10 నుంచి 15 ఫీట్ల వెడల్పు గల ఇరుకు రోడ్లు ఉన్నాయి. దీంతో మర్లు ప్రధాన రోడ్డు నుంచి లోపలికి వెళ్లాలంటేనే అవస్థలు తప్పవు. పెద్ద వాహనాలు నడిచే పరిస్థితి లేదు. దీంతో చుట్టుపక్కలవారు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన వారు అక్కడికి వెళ్లి కూల్చివేశారు. ఇదే వార్డులోని శాంతినగర్ వీధి నం.7లో ఏకంగా రోడ్డు మధ్యలో ఓ ఇంటి ప్రహరీ నిర్మించారు. ఇదేమిటని స్థానికులు అడిగితే గతంలో జీపీ లే-అవుట్ ప్రకారం నిర్మాణం చేపట్టామని చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఆ రోడ్డు 20 ఫీట్లు ఉంటే సగం వరకు ఈ నిర్మాణమే కనిపిస్తుంది. ఇక ఎన్‌హెచ్-167 విస్తరణలో భాగంగా ప్రధాన రోడ్డు వెంట గతంలో మార్క్ చేసినంత వరకు బిల్డింగ్‌లను అధికారులు కూల్చివేయగా.. కొందరు అలాగే ఉంచడం కొసమెరుపు.



శాంతినగర్ వీధిలో రోడ్డుపైనే ప్రహరీ ఇలా



విఘ్నేశ్వరకాలనీలో రోడ్డుపై నిర్మించిన మెట్లు

మాకు ఫిర్యాదు చేయాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ లేదా పార్కు స్థలాల్లో ఎక్కడైనా ప్రైవేట్ వ్యక్తులు నిర్మాణాలు చేపడితే మాకు ఫిర్యాదు చేయాలి. ఆ మేరకు డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ (డీటీసీ)కి నివేదించి అక్రమ కట్టడాలను కూల్చివేయిస్తాం.

– డి.ప్రదీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

సీతమ్మ అందాలు.. రామయ్య గోత్రాలు

శ్రీరామ.. సీతారామ.. జగదభిరామ.. తారకరామ.. పావనరామ.. పట్టాభిరామ.. అంటూ భక్తజనం శ్రీరాముడి నామాన్ని జపిస్తూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. గురువారం శ్రీరామ నవమి వేడుకలను పల్లె, పట్టణం తేడా లేకుండా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాములకు వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య కల్యాణం చూడముచ్చటగా జరిపించారు. ఉమ్మడి జిల్లాలో రెండో అపర భద్రాద్రిగా పేరుగాంచి సిర్సనగండ్ల, మహిమాన్విత క్షేత్రం శ్రీరామకొండ, బీచుపల్లిలోని సీతారామచంద్రస్వామి, మన్యంకొండ, వట్టెం తదితర ఆలయాల్లో ఉత్సవాలను కనుల పండువగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు. అలాగే ఆయా ఆలయాల్లో ప్రముఖులు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల అనంతరం భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ చేశారు.



సిర్సనగండ్లలో వేడుకలకు హాజరైన భక్తులు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు
- కనుల పండువగా సీతారాముల కల్యాణోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- ఆలయాల్లో ప్రముఖుల ప్రత్యేక పూజలు

కోదండరామస్వామి ఆలయంలో..



సీతారాముల మూల విగ్రహాలకు హారతిస్తున్న అర్చకుడు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి కోదండరామ స్వామి ఆలయంలో గురువారం సీతారాముల కల్యాణాన్ని అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహ ఆచారి ఆధ్వర్యంలో సీతారాములకు ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఉదయం 10 గంటలకు వేదమంత్రాల నడుమ సీతారాములకు కల్యాణాన్ని జరిపారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు హైదరాబాద్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐ భక్తుడి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు పేర్కొన్నారు.

అపరభద్రాద్రి సిర్సనగండ్లలో..



సిర్సనగండ్లలో కల్యాణ తంతును వీక్షిస్తున్న ఎమ్మెల్యే గువ్వల, జైపాల్‌యాదవ్, ఎస్పీ మనోహర్

చారకొండ: అపర భద్రాద్రిగా పేరుగాంచిన సిర్సనగండ్ల క్షేత్రంలో సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాగర్‌కర్నూల్ ఎస్పీ మనోహర్ దంపతులు, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, బీజేపీ నాయకుడు ఆచారి తదితరులు కల్యాణ వేడుకకు హాజరయ్యారు. మధ్యాహ్నం ఒంటిగంటకు పండితుల వేదమంత్రాలు, భాజాభజంత్రీలు, భక్తుల శ్రీరామ నినాదాల మధ్య సీతారాముల కల్యాణం అత్యంత వైభవోపేతంగా జరిగింది. 11.30 గంటలకు పురోహితులు సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపానికి తీసుకురాగా.. 12 గంటలకు ప్రారంభమైన కల్యాణ మహోత్సవం ఒంటిగంటకు పూర్తయింది. వేలాదిమంది భక్తుల సమక్షంలో కల్యాణ తంతును పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఉదయం 8 గంటల నుంచే స్వామివారి దర్శనానికి బారులుతీశారు. దాదాపు 30 వేల మందికిపైగా భక్తులు కల్యాణోత్సవానికి హాజరైనట్లు దేవస్థాన చైర్మన్ రామశర్మ తెలిపారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీ ఘటనలకు చోటుచేసుకోకుండా కల్వకుర్తి డీఎస్పీ గిరిబాబు ఆధ్వర్యంలో వెల్దండ సీఐ రామకృష్ణ, చారకొండ ఎస్‌ఐ కల్యాణ్‌రావు తదితరులు బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో చారకొండ, వంగూరు ఎంపీపీలు నిర్మల, భీమమ్మ, సర్పంచ్‌లు విజేందర్‌గౌడ్, వెంకటయ్యయాదవ్, శారద, నరేష్‌నాయక్, ప్రశాంత్, శ్రీను, సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్యగౌడ్, నాయకులు వెంకటయ్యయాదవ్, సలీం తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



మహబూబ్‌నగర్‌లోని రామాలయంలో పూలదండలతో నాట్యం చేస్తున్న మహిళలు

మహిమాన్విత క్షేత్రం శ్రీరామకొండపై..



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తదితరులు

కోయిల్‌కొండ: పాలమూరు జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మహిమన్వితమైన శ్రీరామకొండపై గురువారం శ్రీరామనవమి సందర్భంగా సీతారామ స్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డితోపాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అలాగే మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణగౌడ్ బియ్యం గింజలపై శ్రీరామనామం రాసి కల్యాణోత్సవంలో తలంబ్రాలుగా అందించారు. గత ఐదేళ్లుగా శ్రీరామ నవమికి బియ్యం గింజలపై శ్రీరామనామం రాసి తలంబ్రాలు అందిస్తున్నట్లు లక్ష్మీనారాయణ తెలిపారు.



బియ్యం గింజలపై శ్రీరామనామం

పర్యాటకంగా అభివృద్ధి చేస్తా..

శ్రీరామకొండను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ.కోటి నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. శ్రీరామకొండలో నూతన దేవాలయ నిర్మాణంతోపాటు ఇతర పనులు త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ సభ్యుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రేమ్‌రాజ్, సూపరిటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి, సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, మాధవులు పాల్గొన్నారు.

మన్యంకొండలో.. కల్యాణ వైభోగం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది శ్రీరామనవమి రోజు స్వామివారి కల్యాణం జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన పల్లకీలో స్వామి దంపతులను గర్భగుడి నుంచి దేవస్థానం సమీపంలోని రామసదనం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాల మధ్య ఊరేగింపు ముందుకు కదిలింది. ప్రత్యేక పూజల అనంతరం కల్యాణతంతులో భాగంగా జీలకర్ర, బెల్లం కార్యక్రమాన్ని సంప్రదాయ రీతిలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనావళి తిలకిస్తుండగా పురోహితుల మంత్రోచ్ఛరణాలు, సన్నాయి వాయిద్యాల మధ్య అమ్మవారి మంగళసూత్రధారణ, తలంబ్రాల కార్యక్రమం కనుల పండువగా సాగింది. అనంతరం స్వామి దంపతులను మళ్లీ పల్లకిలో గర్భగుడి వద్దకు తీసుకెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రకరకాల పూలు, వివిధ ఆభరణాల అలంకరణలో స్వామిదంపతులు ధగధగా మెరిసిపోతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. ఈ దృశ్యాన్ని చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకించిపోయారు.

నేడు పట్టాభిషేకం..

మన్యంకొండలో శుక్రవారం స్వామివారి పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దేవస్థానంలోని రామ సదనంలో పవిత్ర కార్యక్రమాన్ని జరిపించడానికి ఏర్పాట్లు చేశారు.

వివిధ ప్రాంతాల భక్తులతో మన్యంకొండ కిటకిటలాడింది. వేడుకల సందర్భంగా భక్తులకు దేవస్థానంలో అన్నదానం ఏర్పాటు చేశారు. దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, రైతుబంధు మండలాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, కోటకదిర సర్పంచ్ రమ్య, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



మన్యంకొండలో కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



స్వామివారి దంపతులకు హారతి ఇస్తున్న అర్చకుడు

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



ఊట్కూరు: ఊట్కూరు శివారులోని విజయ్ కాటన్ మిల్లు సమీపంలో గురువారం కృష్ణమాచారి(43) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం... చిన్నజట్రం గ్రామానికి చెందిన నారాయణపేట మండలానికి చెందిన కృష్ణమాచారి అనే వ్యక్తి మక్తల్ పట్టణానికి వెళ్లి తిరిగి వస్తుండగా ద్విచక్రవాహనంపై అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో తలకు బలంగా గాయాలు కావడంతో స్థానికులు చికిత్స కోసం నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ విషయమై మృతుని భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పల్లె ప్రకృతివనం అగ్నికి ఆహుతి



కాలిపోయిన మొక్కలు

మాగనూర్: మండల కేంద్రంలోని పల్లె ప్రకృతివనం అగ్నికి ఆహుతైంది. ప్రమాదవశాత్తు అంటుకున్న మంటల్లో సుమారు 150కి పైగా మొక్కలు కాలిపోయాయి. ఈ ప్రమాదానికి గ్రామస్తులు రెండు కారణాలు చెబుతున్నారు. పల్లె ప్రకృతివనం పక్కనే డంపింగ్ యార్డు షెడ్ ఉండటంతో అక్కడ వేసిన చెత్తకు నిప్పు పెట్టడం వల్ల మంటల వ్యాపించాయని కొందరు అంటున్నారు. డంపింగ్ యార్డు సమీపంలో కొందరు నిత్యం పేకాట ఆడుతూ మద్యం, సిగరెట్లు తాగి పడేయడం వలన ఈ మంటలు వ్యాపించాయని మరికొందరు ఆరోపిస్తున్నారు.

లంచగొండుల రాజ్యం నడుస్తోంది



రాజోళి మండలం తూర్పు గార్లపాడులో మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రిని సమస్యల గురించి అడగలేరు, ప్రగతి భవన్‌కు వెళ్లలేరని ఎద్దేవా
- ఉద్యోగాలు అమ్ముకున్నారు దొంగలు
- బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

రాజోళి/శాంతినగర్: రాష్ట్రంలో లంచగొండుల రాజ్యం నడుస్తోందని, బహుజనుల రాజ్యం కావాలంటే ఏనుగు గుర్తుకు ఓటేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని పైపాడు, మండలంలోని బుడమొర్సు, రాజోళి మండలం తూర్పుగార్లపాడులో గురువారం రాత్రి బీఎస్పీ రాష్ట్ర చీఫ్ రోడ్ షో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నో సమస్యలున్నా ఎవరూ పట్టించుకునే వారు లేరన్నారు. చివరికి ఉద్యోగాలు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. నిరుపేదలైన మహిళలకు భర్తలు చనిపోయి రోడ్డున పడితే ఆసరా పింఛన్ ఇవ్వడంలేదని ఆరోపించారు. పైపాడు ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతులు కరువయ్యావని, ఉపాధ్యాయులు కూడా సరిగాలేరని, ఆటస్థలం లేదని, మరుగుదొడ్లు సరిగాలేవని, నిరుపేదలకు నాణ్యమైన విద్య ఎలా లభిస్తుందని ప్రశ్నించారు. నియోజక వర్గాల్లో సమస్యల గురించి ముఖ్యమంత్రికి చెప్పే పరిస్థితుల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లేరని, ప్రగతి భవన్‌కు వెళ్లి సమస్యలు వివరించే ధైర్యం వారికి లేదని విమర్శించారు. నిరుపేదలందరికీ న్యాయం జరగాలన్నా, పింఛన్‌లు, ఇళ్లు, కాంట్రా క్టులు, సీసీ రోడ్లు, ఉద్యోగాలు కావాలన్నా బీఎస్పీ పార్టీ ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించుకోవాలని కోరారు.

ప్రజల సొమ్మును దోచుకుంటున్న కల్వకుంట్ల కుటుంబం

ప్రజల సొమ్మును కల్వకుంట్ల కుటుంబం అడ్డగోలుగా దోచుకుంటోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. రాష్ట్రంలో నిరుద్యోగులు, రైతులు తమ కష్టాలు తీరక కన్నీటితో కాలం వెల్లదీస్తుంటే, సీఎం కేసీఆర్, ఆయన కుటుంబం మాత్రం ఖరీదైన వాచ్‌లు పెట్టుకుని, కార్లల్లో తిరుగుతున్నారని విమర్శించారు. గ్రామాలకు వెళ్లేందుకు సరైన రోడ్లు లేవని, ఇప్పటికీ అలంపూర్ నియోజకవర్గంలో వైద్యానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చాలా నివాసాలు మురుగునీటి పక్కనే ఉన్నాయని.. ఇవీ బీఆర్‌ఎస్ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పథకాలు పేరు చెప్పి ఏళ్ల తరబడి ప్రజలను మభ్య పెడుతున్నారే తప్ప, ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు.

■ 50ఏళ్లుగా ఆర్డీఎస్ కెనాల్‌కు పూర్తిస్థాయిలో సాగు నీరందలేదని, పక్కనే తుంగభద్రనది ఉన్నా ఆర్డీఎస్ కెనాల్ కట్టినప్పటి నుండి నీళ్లు రాలేదన్నారు. కేసీ కెనాల్‌కు, రాయలసీమ రైతులకు మాత్రం 365 రోజులు నీరందుతోందన్నారు. తుమ్మిళ్ల లిఫ్ట్ ఏర్పాటు చేసినా ఫలితం లేదన్నారు. పేపర్ లీక్ చేసిన వారికి శిక్షపడేలా చూడాలని తాము ఆందోళన చేస్తుంటే.. వారిని రక్షించేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామాలను దత్తత తీసుకుంటానని చెబుతూ.. మొదట 150 ఎకరాల్లో వ్యవసాయ క్షేత్రాన్ని ఏర్పాటు చేసుకుని ప్రస్తుతం 300 ఎకరాల్లో ఫాంహౌస్ కట్టుకున్నారని, చుట్టూ 8 అడుగుల మేర కాంపౌండ్ వాల్, ప్రజల డబ్బులతో 200 మంది పోలీసులను కాపలా పెట్టుకున్నారని మండిపడ్డారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

లింగాల: ప్రేమ పెళ్లి విఫలం కావడంతో మనస్థాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం మండలంలోని కొత్తకుంటపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బిందు, ఆంజనేయులు ఈ నెల 2న జటప్రోల్‌లోని ఓ ఆలయంలో ప్రేమ పెళ్లి చేసుకున్నారు. ఈ పెళ్లిని అమ్మాయి తరఫు పెద్దలు అంగీకరించకపోగా.. తనకు ఈ వివాహం అక్కర్లేదని పోలీస్‌స్టేషన్‌లో అమ్మాయితో వాంగ్మూలం ఇప్పించారు. దీంతో మనస్థాపానికి గురైన యువకుడు ఇంట్లో పురుగుమందు తాగడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు, జేసీబీలు

వీపనగండ్ల: మండల పరిధిలోని తూంకుంట వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 5 ట్రాక్టర్లు, 2 జేసీబీలను సీసీఎస్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి ఆకస్మిక దాడులు చేసి పట్టుకున్నారు. తూంకుంట అధికారక రీచ్ నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ట్రాక్టర్లకు ఇసుకను లోడ్ చేస్తున్నట్లు సమాచారం అందడంతో, వెళ్లి వాహనాలను అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామన్‌గౌడ్ తెలిపారు.



తూంకుంట వాగులో పట్టుబడిన ట్రాక్టర్లు, జేసీబీలు

వృద్ధురాలి గొంతుకోసిన గుర్తుతెలియని దుండగులు

మదనాపురం: ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలిని గుర్తుతెలియని దుండగులు కత్తితో గొంతు కోశారు. మండలంలోని కొన్నూరు పెద్దతండాలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. తండాకు చెందిన వృద్ధురాలు పాత్లావత్ మోతెమ్మ(80) బుధవారం రాత్రి ఇంట్లో నిద్రించింది. ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో వృద్ధురాలు కేకలు వేయడంతో చుట్టుపక్కల ఇళ్ల వారు వచ్చిచూడగా గొంతుకు గాయమై రక్తం కారుతోంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ మంజునాథరెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. గురువారం ఉదయం జిల్లాకేంద్రం నుంచి జాగిలాలను రప్పించి అన్వేషించారు. వృద్ధురాలిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని ఎస్‌ఐ తెలిపారు. ఆస్తి తగదాలు, పాత గొడవలు ఇతర విషయాలపై విచారణ చేస్తున్నామని, రెండు రోజుల్లో పూర్తి వివరాలు తేలుస్తామన్నారు. ఈ ఘటనతో తండావాసుల్లో ఒక్కసారిగా భయాందోళన నెలకొంది.



గాయపడిన వృద్ధురాలు మోతెమ్మ

పశువులను తరలిస్తున్న కంటైనర్ పట్టివేత

జడ్చర్ల: ఓ కంటైనర్‌లో పశువులను గుట్టుగా తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు చేసి వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. సీఐ రమేశ్‌బాబు కథనం మేరకు.. ఆదిలాబాద్ నుంచి గోవాకు ఓ కంటైనర్‌లో పశువులను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో 44వ నంబర్ జాతీయ రహదారిపై బూరెడ్డిపల్లి గ్రామ శివారులో తనిఖీలు చేపట్టారు. కంటైనర్‌ను తెరచి చూడగా 32 పశువులు ఉన్నట్లు గుర్తించారు. వాహనంలో కుక్కి హింసిస్తూ తరలిస్తున్న పరిస్థితిని గమనించారు. పశుసంవర్ధక శాఖ డాక్టర్‌చే వైద్య పరీక్షలు నిర్వహించి, అనంతరం హన్వాడ మండలం చిన్నదర్పల్లిలోని గోశాలకు తరలించారు. కంటైనర్ డ్రైవర్, కారణమైన వారిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.



పశువులను తరలిస్తున్న కంటైనర్

యువకుడి అదృశ్యం

మహబూబ్‌నగర్ క్రైం: నమాజ్ చేయడానికి వెళ్తున్నాని ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు కన్పించకుండా పోయాడు. వన్‌టౌన్ ఎస్‌ఐ జగన్నాథం కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్‌లోని హనుమాన్‌పుర ఏరియాకు చెందిన ఎండీ ఖయూముద్దీన్ ఈనెల 27న మధ్యాహ్నం ఇంట్లో నమాజ్‌కు వెళ్తున్నాని చెప్పి బయటకు వెళ్లాడు. కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించిన వివరాలు తెలియకపోవడంతో గురువారం తండ్రి మహ్మద్ హలీం పాష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా...


తిరుమంజనంలో సేద తీరుతున్న సీతారామ లక్ష్మణ సమేత హనుమంతుల వారు

శ్రీవారి ఆలయంలో ఘనంగా శ్రీరామనవమి ఆస్థానం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం శ్రీరామనవమి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి 9 నుంచి 10 గంటల నడుమ ఆలయంలోని బంగారువాకిలి చెంత శ్రీరామనవమి ఆస్థానం వేడుకగా జరిగింది. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి తోమాలసేవ, అర్చన ఏకాంతంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శ్రీసీతారామలక్ష్మణ సమేత హనుమంతులవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఈవో ఎ.వి.ధర్మారెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో రమేష్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు. గురువారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీరాముడు తన భక్తుడైన హనుమంతునిపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హనుమంతవాహన సేవలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కాగా, తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది.

ఏపీలో 4 రోజులు తేలికపాటి వానలు

సాక్షి, విశాఖపట్నం: ఏపీలో మరో నాలుగు రోజులు తేలికపాటి వర్షాలు కురవనున్నాయి. కొద్దిరోజులుగా రాష్ట్రంలో చెదురుమదురుగా వానలు పడుతున్నాయి. ప్రస్తుతం ఉత్తర ఛత్తీస్‌గఢ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకు విదర్భ, కర్ణాటకల మీదుగా ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ గురువారం తెలిపింది. అదే సమయంలో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులు సంభవిస్తాయని పేర్కొంది. అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉందని తెలిపింది. గురువారం పార్వతీపురం మన్యం జిల్లా బలిజపేటలో 2.6 సెంటీమీటర్లు, అన్నమయ్య జిల్లా నూతనకల్వలో 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.



ఒంటిమిట్టలో మార్మోగిన రామనామ స్మరణ

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న వైఎస్సార్ జిల్లాలోని ఒంటిమిట్ట శ్రీకోదండ రామస్వామి ఆలయంలో గురువారం శ్రీరామనవమి సందర్భంగా రామనామ స్మరణ మార్మోగింది. ఆలయ టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు ఆధ్వర్యంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సతీసమేతంగా శ్రీకోదండరామస్వామికి ప్రభుత్వ లాంఛనాలతో పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. శ్రీరామనవమి కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు.

పోలవరం తాజా అంచనాలు ఆమోదించాలి

- అడ్‌హాక్‌గా రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలి
- ఏపీకి రావాల్సిన బకాయిలు విడుదల చేయాలి
- రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ రూ.36,625 కోట్లు ఇవ్వాలి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ సీఎం జగన్ వినతి


ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం జగన్

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు అంచనాలను టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) నిర్ధారించిన రూ.55,548 కోట్లకు వెంటనే ఆమోదం తెలపాలని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. పోలవరం ప్రాజెక్టును వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి అడహాక్‌గా రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అంశాలపై కేంద్రంతో చర్చించేందుకు బుధవారం ఢిల్లీకి వచ్చిన ఆయన గురువారం ఉదయం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి అందాల్సిన నిధులు, బకాయిల అంశాలతో పాటు ప్రత్యేక హోదా అంశాలపై సుమారు అర గంట పాటు చర్చించారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి డయాఫ్రం వాల్ ప్రాంతంలో చేయాల్సిన మరమ్మతులకు దాదాపు రూ.2,020 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని, ఈ నిధులనూ వెంటనే విడుదల చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఖర్చు చేసిన రూ.2,600.74 కోట్లను సత్వరమే రీయింబర్స్ చేయాలన్నారు. సీఎం జగన్ ఇంకా ప్రస్తావించిన అంశాలు ఇలా ఉన్నాయి.

- రుణాల విషయంలో రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలు సరికాదు. వీటి విషయంలో పునరాలోచన చేయాలి. ప్రస్తుత ప్రభుత్వ తప్పు లేకున్నా, రుణాలపై కేంద్రం ఆంక్షలు విధించింది. నిబంధనల ప్రకారం ఇచ్చిన రుణ పరిమితిని కూడా తగ్గించారు. 2021–22లో రూ.42,472 కోట్ల రుణ పరిమితి కల్పించి, తదుపరి కాలంలో రూ.17,923 కోట్లకు కుదించారు. ఈ విషయంలో కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవాలి.
- ఉపాధి హామీ పనులకు సంబంధించి రాష్ట్రానికి ఇవ్వాల్సిన బకాయిలు సుమారు రూ.2,500 కోట్లు వెంటనే మంజూరు చేయాలి.
- 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకు సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి తెలంగాణ డిస్కంల నుంచి ఏపీ జెన్‌కోకు రూ.7,058 కోట్లు రావాల్సి ఉంది. ఈ డబ్బును వెంటనే ఇప్పించాలి.
- 2014–15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రానికి రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద రూ.36,625 కోట్లు పెండింగులో ఉన్నాయి. వీటిని విడుదల చేయాలి.
- రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంట్ సాక్షిగా కేంద్రం హామీ ఇచ్చింది. ఈ దృష్ట్యా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి.

తాడేపల్లి చేరుకున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన రెండు రోజుల ఢిల్లీ పర్యటనను ముగించుకుని గురువారం తిరిగి తాడేపల్లికి చేరుకున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసేందుకు ఈ నెల 29న మధ్యాహ్నం ఢిల్లీకి వెళ్లారు. బుధవారం రాత్రి అమిత్‌షాను కలిశారు. గురువారం ఉదయం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అనంతరం ఢిల్లీ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3 గంటలకు తాడేపల్లిలోని నివాసానికి చేరుకున్నారు.

‘మార్గదర్శి’ అక్రమాలు నిజం!

▶ మొదటి పేజీ తరువాయి

అప్పటికే వేరే సంస్థల ఖాతాల్లోకో, ఇతరత్రా అవసరాలకో మళ్లించేశారు. కానీ... అవన్నీ తమ వద్దే ఉన్నట్లుగా తప్పుడు బ్యాలెన్స్‌షీట్ ద్వారా మభ్యపెడుతున్నారు. తమ సంస్థ తగిన ఆస్తులతో బలంగానే ఉన్నదని ఒక వైపు చిట్లు వేస్తున్న చిట్‌దారులను, మరో వైపు నియంత్రణ సంస్థలను నమ్మిస్తున్నారు. ఇదీ.. రామోజీరావు నడిపిస్తున్న ‘మార్గదర్శి’అసలు కథ. మార్గదర్శి సంస్థను ఆడిట్ చేస్తున్న ఆడిటింగ్ సంస్థల ప్రతినిధి నేరుగా దర్యాప్తు సంస్థ ఎదుట అంగీకరించిన వాస్తవం. ఇదే కాదు. తనిఖీలకు అడుగడుగునా అడ్డుపడుతున్న మార్గదర్శిలో... ఎక్కడ ఏ సోదా జరిపినా నివ్వెరపోయే నిజాలే వెలుగుచూస్తున్నాయి. వాస్తవాలను బయటకు వెల్లడించకపోవటం ద్వారా... చిట్లు వేస్తున్నవారికి తమ సొమ్ము ఎంత భద్రంగా ఉందో, లేదో కూడా తెలియని పరిస్థితి సృష్టిస్తున్నారు. అంతేకాదు.. డిపాజిట్లు తీసుకోవటాన్ని నిషేధించినా సరే... వాటిని ఇతరత్రా రూపాల్లో తీసుకుంటూ నిబంధనలకు తూట్లు పొడుస్తూనే ఉన్నారు. చట్టాలను పరిహాసం చేస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లోని మార్గదర్శి ఆడిటింగ్ సంస్థ బ్రహ్మయ్య అండ్ కో కంపెనీలో సీఐడీ జరిపిన తనిఖీల్లో వెల్లడైన పలు అక్రమాలు బయటపడ్డాయి.

చార్టర్డ్ అకౌంటెంట్‌కు 14 రోజుల రిమాండ్..

మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్యాంకు లావాదేవీలు, రికార్డుల నిర్వహణలో పలు అవకతవకలున్నట్లు మార్గదర్శి చిట్స్‌కు ఆడిటర్‌గా వ్యవహరిస్తున్న బ్రహ్మయ్య అండ్ కో ప్రతినిధి సీఐడీ విచారణలో వెల్లడించారు. దాంతో బ్రహ్మయ్య అండ్ కో సీఏ కుదరవల్లి శ్రావణ్‌ను సీఐడీ అధికారులు అరెస్టు చేసి గురువారం విజయవాడలోని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా... చందాదారుల సొమ్మును తరలించటం, మ్యూచువల్ ఫండ్స్‌లో, షేర్లలోనూ అక్రమంగా పెట్టుబడులు పెట్టడం, ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లు సేకరించడం చేసినట్లు ఇప్పటికే సీఐడీ అధికారులు గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే బ్రహ్మయ్య అండ్ కో సంస్థ రికార్డులను తనిఖీ చేసి, ఆ సంస్థ సీఏ శ్రావణ్‌ను విచారించారు. ఈ విచారణలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలు మరిన్ని వెలుగులోకి వచ్చాయి. మార్గదర్శి ఖాతాలు సవ్యంగానే ఉన్నాయని ఏటా ఆడిట్ నివేదిక ఇస్తున్న ఈ సంస్థ... అసలు మార్గదర్శి చిట్స్ బ్యాంకు ఖాతాలు, రికార్డులు, లావాదేవీలను సమగ్రంగా పరిశీలించకుండానే ఈ నివేదిక ఇస్తున్నట్లు సదరు చార్టర్డ్ అకౌంటెంట్ వెల్లడించటం గమనార్హం.

ఇలాంటి డిపాజిట్లు ప్రమాదకరమే?

- చిట్లు వేసేవారిలో కొందరు చిట్‌ను పాడుకుంటారు కానీ... ఆ డబ్బును తీసుకోవటానికి అవసరమైన ష్యూరిటీలను కంపెనీకి సబ్‌మిట్ చేయలేరు. మరికొందరైతే రకరకాల కారణాల వల్ల పాడుకున్న మొత్తాన్ని తీసుకోకుండా భవిష్యత్తులో తాము చెల్లించాల్సిన చిట్ మొత్తానికి సంబంధించి దాన్ని సదరు చిట్‌ఫండ్ సంస్థ వద్దే వదిలిపెడతారు. ఇంకొందరైతే ఓ రెండు మూడు నెలలు ఉన్నప్పుడు చిట్‌ను పాడుకుని... ఆ మిగిలిన నెలల ఫ్యూచర్ చిట్ సబ్‌స్క్రిప్షన్ మొత్తాన్ని సంస్థ దగ్గరే వదిలేస్తారు. అయితే ఏ చిట్‌ఫండ్ సంస్థయినా తమ ప్రతి బ్రాంచి కార్యాలయంలోనూ... అక్కడి చిట్లకు సంబంధించిన ఫ్యూచర్ సబ్‌స్క్రిప్షన్ మొత్తాన్ని జమ చేసేందుకు ప్రత్యేకంగా రెండో బ్యాంకు ఖాతాను నిర్వహిస్తుండాలి. ఇలా ఫ్యూచర్ చిట్ల మొత్తాన్ని ఆ ఖాతాలో జమ చేయాలి. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ ఏ ఒక్క బ్రాంచిలోనూ ఇలా ఫ్యూచర్ సబ్‌స్క్రిప్షన్ మొత్తాన్ని డిపాజిట్ చేయడానికి వేరే బ్యాంకు ఖాతా తెరవలేదు. అన్నిచోట్ల నుంచీ ఆ మొత్తాన్ని హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి తరలిస్తోంది. దానికో రోజు ఇస్తూ 4–5 వడ్డీ చెల్లిస్తోంది. ఇది అనధికారికంగా డిపాజిట్లు వసూలు చేయటమే. చట్టవిరుద్ధంగా వసూలు చేస్తున్న ఈ డిపాజిట్లను గనక ఏ ఆర్‌బీఐనో జప్తు చేస్తే..? చిట్‌దారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారే ప్రమాదం ఉంది. అయినా సరే మార్గదర్శి వసూలు చేస్తున్న అక్రమ డిపాజిట్లు సక్రమమేననే రీతిలో బ్రహ్మయ్య అండ్ కో సంస్థ నివేదిక ఇవ్వటం విస్మయం కలిగించేదే!!.
- ఇక మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ ఆదాయ, వ్యయాల ఖాతాలు, ఆస్తి, అప్పుల ఖాతాలు, తమ పెట్టుబడులు వివరాలను బహిర్గతం చేయటం లేదు. గోప్యంగా ఉంచుతోంది. ఇది చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధం. అయినా సరే బ్రహ్మయ్య అండ్ కో ఇది పట్టించుకోకుండా అంతా సక్రమంగానే ఉందని ఆడిట్ నివేదిక ఇచ్చేస్తోంది.

అక్రమాలు వాస్తవమే: బ్రహ్మయ్య సంస్థ సీఏ శ్రావణ్

సీఐడీ దర్యాప్తు సందర్భంగా బ్రహ్మయ్య అండ్ కో సీఏ కుదరవల్లి శ్రావణ్ కీలక విషయాలు వెల్లడించారు. తాము అసలు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లో రికార్డులను వ్యక్తిగతంగా పరిశీలించకుండానే ఆడిట్ నివేదిక జారీ చేస్తున్నామని అంగీకరించారు. మార్గదర్శి చిట్స్ ఆదాయ–వ్యయాలు, ఆస్తి– అప్పులకు సంబంధించిన ఎలాంటి వివరాలనూ ఆయన సీఐడీ అధికారులకు చెప్పలేకపోయారు. ఒక్కో బ్రాంచి బ్యాంకు ఖాతాల్లో అప్పుడప్పుడు చూపిస్తున్న వందల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయి? ఆ తరువాత అవి ఎక్కడికి మాయమయ్యాయి? అనేది ఆయన ఏమాత్రం చెప్పలేకపోయారు. ఆ వివరాలేవీ తనకు తెలియవని ఆయన అంగీకరించారు.

ఆర్థిక నగరాల నిర్మాణంపై వ్యూహాలు

- సామర్థ్యం నిర్మాణంపై వర్క్‌షాపులో జీ–20 దేశాల సమర్పణ

సాక్షి, విశాఖపట్నం: భవిష్యత్తులో స్థిరమైన ఆర్థిక నగరాల నిర్మాణంపై జీ–20 దేశాల ప్రతినిధులు తమతమ వ్యూహాలను సమర్పించారు. విశాఖపట్నంలో జరుగుతున్న జీ–20 దేశాల రెండో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూపు (ఐడబ్ల్యూజీ) సమావేశాల్లో మూడోరోజైన గురువారం ‘సామర్థ్య నిర్మాణం’పై వర్క్‌షాపును ఇండియన్ ప్రెసిడెన్సీ, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సదస్సులో జీ–20 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఫైనాన్సింగ్‌లలో అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులను చర్చించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. స్థానిక ప్రభుత్వాలు సమగ్ర, స్థిరమైన నగరాల కోసం అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఆర్థిక సాయం చేయడానికి అవసరమైన సామర్థ్యాలపై దృష్టిసారించారు. వర్క్‌షాపు మొదటి సెషన్‌లో భారత్ సహా సింగపూర్, దక్షిణ కొరియా, రష్యా, చైనా, యూరోపియన్ కమిషన్ నిపుణులు తమ దేశాల్లో అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను ప్రదర్శించారు. సింగపూర్‌లోని నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఏజెన్సీ మాజీ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, డైరెక్టర్ జనరల్ అహ్ తువాన్‌లోహ్.. సింగపూర్ విధానాలు, సమ్మిళిత, స్థిర నగరాలను నిర్మించే వ్యూహాలను సమర్పించారు. ఇందులో డైనమిక్ అర్బన్ గవర్నెన్స్ సిస్టంతో సహా జీవించడం, ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లానింగ్, అభివృద్ధి, వ్యర్థాలు, నీటి నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణ, విద్య తదితర అంశాలపై వివరించారు. సెషన్ అనంతరం దక్షిణ కొరియా ప్రతినిధులు పట్టణాభివృద్ధి, ఫైనాన్సింగ్‌లపై సవాళ్లు, ప్రపంచ వ్యాప్తంగా విజ్ఞానాన్ని వ్యాప్తి చేయడంపై మాట్లాడారు.

ఏటీఎం చోరీకి యత్నం

మహబూబ్‌నగర్ క్రైం: గుర్తు తెలియని దొంగలు అర్ధరాత్రి సమయంలో ఏటీఎంలో దొంగతనం చేయడానికి ప్రయత్నించి విఫయం అయ్యారు. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని భగీరథ కాలనీ సమీపంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో గురువారం అర్ధరాత్రి తర్వాత 1.30 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని దొంగలు లోపలికి ప్రవేశించి ఏటీఎంలో ఉన్న డబ్బులను దొంగతనానికి యత్నించి విఫలం అయ్యారు. డబ్బులు రాకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎస్‌బీఐ మేనేజర్ సుష్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

నిచ్చెనపై నుంచి జారి పడి ప్లంబర్ మృతి

మహబూబ్‌నగర్ క్రైం: ఓ ఇంట్లో ప్లంబర్ పని చేయడం కోసం వెళ్లిన యువకుడు ఫస్ట్‌ఫ్లోర్ పైకి ఇనుప నిచ్చెన వేసుకుని ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. టూటౌన్ ఎస్‌ఐ రవిప్రకాష్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని కొత్తచెరువు రోడ్ ఏరియాకు చెందిన మహ్మద్ ఖలీం (26) ఈనెల 29న సాయంత్రం జిల్లాకేంద్రంలోని షాషాబ్‌గుట్ట ప్రాంతంలో మీర్జా రఫీ బేగ్ ఇంట్లో ప్లంబర్ పని కోసం వెళ్లాడు. ఈ క్రమంలో మొదటి అంతస్తులో పని చేయడం కోసం ఇనుప నిచ్చెన వేసుకుని ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారికింద సీసీ రోడ్డుపై పడటంతో తలకు వెనుకభాగంలో బలమైన రక్తగాయం కావడం వల్ల చెవులు, ముక్కులో నుంచి రక్తస్రావమైంది. దీంతో వెంటనే చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి అన్న మహ్మద్ సలీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి దుర్మరణం

జడ్చర్ల: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో గురువారం ఓ గుర్తు తెలియని వ్యక్తి(35) రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ తెలిపారు. జడ్చర్ల–దివిటిపల్లి మార్గంలో మృతదేహాన్ని గుర్తించి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, ప్రమాదవశాత్తు రైలు కింద పడ్డాడా?, ఆత్మహత్య చేసుకున్నాడా? తెలియాల్సి ఉందన్నారు.

ఉచిత శిక్షణ.. ఆర్థిక రక్షణ


నవాబుపేటలో కుట్టు శిక్షణలో మహిళలు

- ఒక్కో బ్యాచ్‌లో 80 మంది మహిళలకు అవకాశం

నవాబుపేట: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా తీర్చిదిద్దేందుకు ఏకల్ విద్యాలయ స్వచ్ఛంద సంస్థ శ్రీకారం చుట్టింది. మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన 80 మంది మహిళలను ఎంపిక చేసి వారికి 90 రోజుల పాటు కుట్టు, అల్లికల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం ధ్రువపత్రాలు కూడా అందిస్తుండటంతో ప్రైవేట్‌తో పాటు ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలు సైతం పొందే అవకాశం ఉంటుంది. మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు తమ గ్రామాల్లో ఉపాధి పొందనున్నారు.

ఉన్న చోటే ఉపాధి..



మహిళలకు కుట్లు, అల్లికల్లో శిక్షణనిచ్చి వారు గ్రామాల్లో ఉపాధి పొందాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపడుతున్నాం. 90 రోజుల శిక్షణ కాలం కుట్టడం, అల్లికలు నేర్చేందుకే సరిపోతుంది. మొదటి బ్యాచ్‌లో 80 మంది శిక్షణ పొంది ధ్రువపత్రాలు సైతం అందుకోనున్నారు.

– అరుణ, శిక్షకురాలు

ఉచిత శిక్షణ భేష్..



కుట్టు నేర్చేందుకు బయట రూ.వేలల్లో డబ్బులు అడుగుతారు. పైగా నేర్పించటం కూడా అంతగా ఉండే అవకాశం లేదు. ఏకల్ విద్యాలయ స్వచ్ఛందసంస్థ ద్వారా ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు ధ్రువపత్రాలు కూడా అందించటం అభినందనీయం. ఉచితంగా కుట్టు మిషన్లు సైతం అందించి చేయూతనివ్వాలి

– శ్రీలత, నవాబుపేట

రాష్ట్రంలో గిడ్డంగుల నిర్మాణాలకు శ్రీకారం


ధర్మాపురం శివారులో ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న సాయిచంద్ తదితరులు

- గిడ్డంగుల శాఖ రాష్ట్ర చైర్మన్ సాయిచంద్

అమరచింత: సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రైతుల ప్రయోజనాల కోసం నూతన గిడ్డంగులను నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని గిడ్డంగుల శాఖ చైర్మన్ సాయిచంద్ తెలిపారు. మండలంలోని ధర్మాపురం గ్రామ శివారులో 10వేల మెట్రిక్ టన్నుల గోదాంలను నిర్మించడానికి కేటాయించిన 10ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సుమారు రూ.12 కోట్ల వ్యయంతో మండలంలో నూతన గిడ్డంగులను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. స్థలం ఎంపికతో పాటు నిధుల మంజూరు పూర్తయ్యిందన్నారు. ఏప్రిల్‌లో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం..

పట్టణంలోని శ్రీహరిహర పుత్ర అయ్యప్ప ఆలయంలో నిత్యం ధూపదీపాల కోసం చైర్మన్ సాయిచంద్ లక్ష రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందించారు. మండలంలోని తూక్యానాయక్ తండాలో నూతనంగా నిర్మించే ఆంజనేయ ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి ప్రత్యేక పూజలు చేశారు. ఆత్మకూర్‌లోని షిరిడి సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, ఆర్‌ఐ గోపాల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, దర్మాపురం సర్పంచ్ గోపిరెడ్డి, డీసీ రాజశేఖర్, డీజే శేఖర్ ఉన్నారు.

మెరిసిన నల్లమల ఆణిముత్యం

- సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన చంద్రప్రకాశ్


కుటుంబసభ్యులతో చంద్రప్రకాశ్

అమ్రాబాద్: పదర మండలం ఉడిమిళ్లకు చెందిన గడదాసు అంజనమ్మ, కృష్ణయ్య దంపతుల రెండో కుమారుడు చంద్రప్రకాశ్ బుధవారం ఛత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్ క్యాంపులో సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. స్వగ్రామంలో ప్రాథమిక విద్య, వట్టెం నవోదయ విద్యాలయలో ఇంటర్ పూర్తి చేశారు. ఇంజినీరింగ్ పూర్తయ్యాక కొన్నాళ్ల పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి సివిల్స్ రాశారు. గుర్గావ్‌లో 2021–22 సంవత్సరం 53వ బ్యాచ్‌లో ఐపీఎస్ శిక్షణ పూర్తి చేశారు.

కుటుంబ పాలనకు చరమ గీతం పాడాలి


మాట్లాడుతున్న గొంగళ్ల రంజిత్ కుమార్

ధరూరు: దశాబ్దాల తరబడిగా సాగుతున్న కుటుంబ పాలనకు నియోజకవర్గ ప్రజలు చరమ గీతం పాడాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ అన్నారు. గురువారం 14వ రోజు ఆత్మగౌరవ పాదయాత్ర మండలంలోని కోతులగిద్ద, అల్లపాడు, కొత్తపాలెం, కొత్తపాలెం తండా తదితర గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు కుటుంబ పాలనగా సాగిన గద్వాలలో అన్ని వర్గాల ప్రజలు అణిచివేతకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. బహుజన జెండా ఎగరవేయడానికి అందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, కార్యదర్శి లవన్న, నాయకులు గోవిందు, మెనెప్ప, తిమ్మప్ప, రంగస్వామి, ఉపేంద్ర, రాము, విష్ణు, ప్రేమ్‌రాజ్, భీమన్‌గౌడ్, అంజి, ఎల్లేష్, జంగిలప్ప తదితరులు పాల్గొన్నారు.

నా సంతకం ఫోర్జరీ చేశారు

- నాగర్‌కర్నూల్ అదనపు ఎస్పీ ఫిర్యాదు

మహబూబ్‌నగర్ క్రైం: చిట్‌ఫండ్ కంపెనీలో అన్ని వాయిదాలు చెల్లించినా కూడా.. లేదంటూ తన సంతకం ఫోర్జరీ చేసి జమానత్‌దారులకు నోటీసులు ఇచ్చారని నాగర్‌కర్నూల్ అదనపు ఎస్పీ మహబూబ్‌నగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో చిట్‌ఫండ్ కంపెనీపై కేసు నమోదైంది. టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లాలో అదనపు ఎస్పీగా పనిచేస్తున్న రామేశ్వర్ 2017 నుంచి 2021 వరకు మహబూబ్‌నగర్‌లోని కపిల్ చిట్‌ఫండ్ కంపెనీలో రూ.5 లక్షల చీటీ వేశారు. ఆ చీటీకి సంబంధించి రెండునెలల వాయిదాలు చెల్లించలేదని కంపెనీ నిర్వాహకులు చీటీకి జామీనుగా ఉన్న వారికి నోటీసులు జారీ చేశారు. కంపెనీ నుంచి తనకు నోటీసులు ఇవ్వకుండా.. తన సంతకం ఫోర్జరీ చేసి నేరుగా జామీనుదారులకు నోటీసులు ఇచ్చారని అదనపు ఎస్పీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వెల్లడించారు. ఏజెంట్‌కు అన్ని వాయిదాలు చెల్లించానని.. ఇందుకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని అదనపు ఎస్పీ ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఆకట్టుకున్న ‘మర్రి’ సైకత శిల్పం

నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు సామల ముఖేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్‌పై ఆయన సైకత శిల్పాన్ని రూపొందించారు. విజయవాడకు చెందిన సైకతశిల్పి బాలాజి వరప్రసాద్ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే చిత్రపటాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గీసిన చిత్రాలు చూపరులను ఇట్టే ఆకట్టుకున్నాయి. సందర్శకులు ఉత్సాహంగా సెల్ఫీలు దిగుతూ కనిపించారు.

– కందనూలు